సాక్షి
శ్రీకాకుళం

బుధవారం । 5 । జూన్ । 2024



అరచేతిలో సమాచారం..
వాతావరణ సమాచారం ఇట్టే అందుతోంది. అరచేతిలోనే సమస్త సమాచారం దొరుకుతోంది.
-2లో



నీట్ ఫలితాల్లో..
నీట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. చక్కటి ర్యాంకులు సాధించారు.
-2లో



డిపాజిట్లు కోల్పోయారు..
సార్వత్రిక ఎన్నికల్లో కొందరు డిపాజిట్లు కోల్పోయారు. వీరంతా స్వతంత్రులు.
-2లో

కూటమి విజయకేతనం

ఇచ్ఛాపురం	పలాస	టెక్కలి	ఎచ్చెర్ల	పాతపట్నం	నరసన్నపేట	శ్రీకాకుళం	ఆమదాలవలస	పార్లమెంట్ శ్రీకాకుళం	పార్లమెంట్ విజయనగరం
									
బెందాళం అశోక్	గౌతు శిరీష	కె. అచ్చెన్నాయుడు	ఎన్.ఈశ్వరరావు	ఎం. గోవిందరావు	బగ్గు రమణమూర్తి	గొండు శంకర్	కూన రవికుమార్	కె.రామ్మోహన్‌నాయుడు	కె.అప్పలనాయుడు
మెజార్టీ: 39,778	మెజార్టీ: 40,350	మెజార్టీ: 34,435	మెజార్టీ: 29,089	మెజార్టీ: 25,238	మెజార్టీ: 29,371	మెజార్టీ: 51,621	మెజార్టీ: 33,183	మెజార్టీ: 3,14,107	మెజార్టీ: 2,49,615
టీడీపీ	టీడీపీ	టీడీపీ	బీజేపీ	టీడీపీ	టీడీపీ	టీడీపీ	టీడీపీ	టీడీపీ	టీడీపీ

- ఎనిమిది అసెంబ్లీ, పార్లమెంట్ స్థానం కైవసం
- ఏడింటిలో టీడీపీ, ఒక స్థానంలో బీజేపీ గెలుపు
- పార్లమెంట్ నుంచి ఎన్నికై హ్యాట్రిక్ సాధించిన రామ్మోహన్‌నాయుడు
- అసెంబ్లీకి కొత్తగా ఎన్నికైన వారిలో గొండు శంకర్, మామిడి గోవింద్, గౌతు శిరీష, ఎన్ఈఆర్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయకేతనం ఎగురవేసింది. ఎవరూ ఊహించని స్థాయిలో జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ స్థానాలను, పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుంది. వాటిలో ఏడు అసెంబ్లీ స్థానాలు టీడీపీ ఖాతాలో చేరగా, ఒకటి బీజేపీ ఖాతాలో పడింది.

కూటమికి ఎనిమిది అసెంబ్లీ, పార్లమెంట్ స్థానం...

శ్రీకాకుళం అసెంబ్లీ నుంచి టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ విజయం సాధించగా, ధర్మాన ప్రసాదరావు ఓటమి పాలయ్యారు. ఆమదాలవలసలో తమ్మినేని సీతారాంపై కూన రవికుమార్ విజయం సాధించారు.. ఎచ్చెర్లలో గొర్లె కిరణ్‌కుమార్‌పై బీజేపీ అభ్యర్థి నడికుదిటి ఈశ్వరరావు, నరసన్నపేటలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్‌పై టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి, టెక్కలిలో దువ్వాడ శ్రీనివాస్‌పై కింజరాపు అచ్చెన్నాయుడు, పలాసలో సీదిరి అప్పలరాజుపై గౌతు శిరీష, ఇచ్ఛాపురంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయపై సిట్టింగ్ ఎమ్మెల్యే బెందాళం అశోక్, పాతపట్నంలో రెడ్డి శాంతిపై టీడీపీ తరఫున పోటీ చేసిన మామిడి గోవిందరావు విజయం సాధించారు. వీరిలో తొలిసారిగా మామిడి గోవిందరావు, గౌతు శిరీష, నడికుదిటి ఈశ్వరరావు, గొండు శంకర్ ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఇక, శ్రీకాకుళం పార్లమెంట్ నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేరాడ తిలక్‌పై సిట్టింగ్ ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు గెలుపొందారు.

నోటా ఇలా..



అరసవల్లి:

సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో గతంలో కంటే అధికంగా నోటాకు ప్రాధాన్యత ఇవ్వడం గమనార్హం. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. ఆమదాలవలసలో 2,300, ఎచ్చెర్లలో 3,952, ఇచ్ఛాపురంలో 4,294, నరసన్నపేటలో 330, పలాసలో 2,767, పాతపట్నంలో 3.544, శ్రీకాకుళంలో 3373, టెక్కలిలో 3660 నోటా ఓట్లు పడగా శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో (ఏడు నియోజకవర్గాలకు) మొత్తం 24, 498 నోటా ఓట్లు నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

మేలు చేశాం.. ప్రజా తీర్పు ఉహించనిది

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: 'వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై నమ్మకంతో 2019లో మాకు ప్రజలు భారీ ఆధిక్యంతో అధికారం ఇచ్చారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా రాజకీయం చేయకుండా, ప్రాంతాల్లో తేడా చూపకుండా కులాల మధ్య అంతరం లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ఇచ్చాం. కానీ ఈ ఎన్నికల ఫలితాలు ఊహించని విధంగా వచ్చాయి' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఎన్నికల ఫలితాలు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా జిల్లాలో కూడా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, కానీ ప్రజల తీర్పు ఈ విధంగా ఉంటుందని అనుకోలేదని పేర్కొన్నారు. ఫలితాలపై సమీక్ష చేసుకుని ముందుకు వెళ్తామన్నారు. ప్రజలకు కూటమి నాయకులు ఈ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరేలా తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. ఈ ఓటమిని చూసి కుంగిపోవద్దని, మహామహులకే ఓటమి తప్పలేదని, రెట్టించిన ఉత్సాహంతో పార్టీని ముందుకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు.

స్నేహితుడిగానే కొనసాగుతాను



శ్రీకాకుళం: ఎన్నికల ముందు చెప్పినట్టుగానే అందరితోనూ స్నేహితుడిగానే కొనసాగుతానని ధర్మాన ప్రసాదరావు అన్నారు. ప్రజాస్వామ్యం మీద పూర్తి విశ్వాసం కలిగి ఉన్నానని, ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుని గౌరవిస్తున్నానని పేర్కొన్నారు. సుదీర్ఘకాలం ఒక ప్రజాప్రతినిధిగా సేవలందించేందుకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తన కోసం రేయింబవళ్లు పనిచేసిన వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు, ఓట్లు వేసిన ప్రజానీకానికి ధన్యవాదాలు తెలుపుతున్నానని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కార్యకర్తలకు, ప్రజలకు అండగా ఉంటా..



టెక్కలి: సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ వైఎస్సార్‌సీపీకి సహకరించిన టెక్కలి నియోజకవర్గం కార్యకర్తలకు, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసిన తనకు ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో కార్యకర్తలకు, ప్రజలకు అండగా ఉంటానని దువ్వాడ శ్రీనివాస్ భరోసా ఇచ్చారు.

పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు




పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం చదురుగుడి, వనంగుడిలలో పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్ల పూడి ధనుంజయ్, మూలాపాపారావు, నేతేటిప్రశాంత్‌లు విశిష్ట కుంకుమార్చన చేశారు. వివిధ రకాల స్వీట్లతో అమ్మవారికి నివేదన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షించారు.



ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా గెలిచాక ఎన్ఈఆర్‌తో అనుచరుల సంబరం



కలెక్టర్ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న అచ్చెన్నాయుడు



విజయనగరం కలెక్టర్ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కలిశెట్టి అప్పలనాయుడు



ఒకే ఒక్కడు..

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో బీజేపీ ఖాతా తెరిచింది. 1952 నుంచి నేటి వరకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా బీజేపీ ఎమ్మెల్యేగా నడికుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) గెలుపొందారు. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపుగా ప్రతి ఎన్నికల్లోనూ బరిలో నిలిచిన భారతీయ జనతాపార్టీకి ఇప్పటి వరకు ఒక్క సీటు కూడా దక్కలేదు.

అయితే తాజా సార్వత్రిక ఎన్నికల్లో సరికొత్త రికార్డు దిశగా బీజేపీ పార్టీ చట్టసభల రాజకీయ ప్రస్థానం ప్రారంభించింది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో కూటమి పొత్తులో భాగంగా బీజేపీ తరఫున ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి పోటీచేసిన నడికుదుటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) వైఎస్సార్‌సీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌పై ఏకంగా 29,089 ఓట్ల మెజారిటీతో విజయాన్ని దక్కించుకున్నారు.

సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే..

శ్రీకాకుళం: శ్రీకాకుళం శాసన సభ నియోజకవర్గం నుంచి గెలిచిన తెలుగుదేశం అభ్యర్థి గొండు శంకర్ సర్పంచ్‌గా వ్యవహరిస్తూనే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బీటెక్ వరకు చదువుకున్న ఆయన కొద్ది సంవత్సరాలు ఇంజినీర్‌గా పనిచేశారు. ఆయన తండ్రి గొండు జగపతి రాజకీయాల్లో ఉండటంతో ఉద్యోగాన్ని వదులుకొని శ్రీకాకుళం వచ్చి తండ్రితో పాటు రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నారు. మాజీ శాసనసభ్యులు గుండ అప్పలసూర్యనారాయణ, లక్ష్మీదేవిలకు ప్రధాన అనుచరునిగా వ్యవహరించారు. ఈ సమయంలోనే రాజకీయ అనుభవం గడించారు. శ్రీకాకుళం రూరల్ మండలం కిష్టప్పపేట సర్పంచ్‌గా వ్యవహరిస్తున్న శంకర్ శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షునిగా కూడా పనిచేస్తున్నారు. అంతకుముందు ఎంపీటీసీగా ఎన్నికై బాధ్యతలు నిర్వర్తించారు. గుండ దంపతులు విభేదించిన గొండు కుటుంబం ఎంపీ రామ్మోహన్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అనుచరునిగా మారి శ్రీకాకుళం నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు చేస్తూ క్యాడర్‌కు దగ్గరయ్యారు. అనూహ్యంగా టీడీపీ అభ్యర్థిత్వాన్ని పొంది విజయం సాధించారు.

ఏకైక మహిళా ఎమ్మెల్యే ..



అరసవల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న వారసురాలు, ఆయన మనవరాలు గౌతు శిరీష తొలిసారి చట్టసభల్లోకి అడుగుపెట్టనున్నారు. 2014లో తొలిసారి ఆమె టీడీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పలాస నుంచి ఎన్నికల బరిలో దిగినప్పటికీ గెలుపు సాధ్యం కాలేదు. అయితే తాజా ఎన్నికల ఫలితాల్లో మాత్రం ఆమె మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై గెలుపొందారు. 1952 నుంచి శ్రీకాకుళం జిల్లా రాజకీయ చరిత్రలో ఈమె 16వ మహిళా ఎమ్మెల్యే కాగా...సంఖ్యా పరంగా 23వ మహిళా ఎమ్మెల్యేగా రికార్డులోకి ఎక్కారు. 1962లో తొలిసారి బ్రాహ్మణతర్ల నుంచి ఎమ్మెల్యేగా బెండి లక్ష్మీనారాయణమ్మ గెలుపొందగా, ఆ తర్వాత 1972లో నరసన్నపేట నుంచి బగ్గు సరోజినమ్మ, పాతపట్నం నుంచి చుక్క పగడాలమ్మ, ఉణుకూరు నుంచి పాలవలస రుక్మిణిలు గెలుపొందారు. ఆ తర్వాత ఎన్టీఆర్ టీడీపీ ఆవిర్భావం 1983లో ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా కావలి ప్రతిభాభారతి గెలిచారు. 1983, 1988, 1989, 1994, 1999లలో కూడా ఆమె ఎచ్చెర్ల ఎమ్మెల్యేగానే గెలుపొందారు. రాష్ట్ర అసెంబ్లీకి తొలి మహిళా స్పీకర్ కూడా ఎన్నికయ్యారు. అలాగే 1985లో టెక్కలి నుంచి వరద సరోజ, 1989లో టెక్కలి నుంచి దువ్వాడ నాగావళి, అలాగే 1989, 1999లలో పాలకొండ నుంచి పీజే అమృతకుమారి, 1996లో ఎన్టీఆర్ సతీమణి నందమూరి లక్ష్మీపార్వతి పాతపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యేగానూ గెలుపొందారు.

అనంతరం 2004లో కొత్తూరు ఎమ్మెల్యేగా మినతి గొమాంగో, 2004, 2009లలో ఆమదాలవలస ఎమ్మెల్యేగా బొడ్డేపల్లి సత్యవతి, 2009లో టెక్కలి ఎమ్మెల్యేగా కొర్ల భారతి, 2014లో, 2019లోనూ పాలకొండ ఎమ్మెల్యేగా విశ్వాసరాయి కళావతి, 2014లో శ్రీకాకుళం ఎమ్మెల్యేగా గుండ లక్ష్మీదేవి, 2014లో పాతపట్నం ఎమ్మెల్యేగా రెడ్డి శాంతిలు ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. తాజాగా వెలువడిన ఎన్నికల ఫలితాల్లో జిల్లా నుంచి గెలుపొందిన ఏకైక మహిళా ఎమ్మెల్యేగా గౌతు శిరీష రికార్డులకెక్కారు.

హ్యాట్రిక్

శ్రీకాకుళం ఎంపీగా..

టీడీపీ నాయకుడు కింజరాపు రామ్మోహన్ నాయుడు ఎంపీగా హ్యాట్రిక్ కొట్టారు. శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం చరిత్రలో మునుపెన్నడూ సాధ్యం కానంతగా రికార్డు స్థాయిలో ఏకంగా 3 లక్షల పైచిలుకు మెజారిటీతో సమీప వైఎస్సార్ సీపీ అభ్యర్థి పేరాడ తిలక్‌పై ఘన విజయం సాధించారు. 2014లో తొలిసారిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన రామ్మోహన్‌నాయుడు వరుసగా మూడోసారి ఎంపీగా గెలిచారు. జిల్లాలో కాంగ్రెస్ నుంచి బొడ్డేపల్లి రాజగోపాలరావు, టీడీపీ నుంచి కింజరాపు ఎర్రంనాయుడుల తర్వాత మళ్లీ రామ్మోహన్నాయుడికే ఈ హ్యాట్రిక్ దక్కింది.

– అరసవల్లి

ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా..

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి బెందాళం అశోక్ హ్యాట్రిక్ సాధించారు. ఈయన 2014లో నర్తు రామారావు పైన, 2019లో పిరియా సాయిరాజ్‌పైన, తాజాగా 2024లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిరియా విజయ పైన విజయం సాధించారు.

– కంచిలి

మామిడికి కలిసివచ్చిన రోజులు ..

కొత్తూరు: పాతపట్నం మండలం సీది గ్రామానికి చెందిన ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన మామిడి గోవిందరావుకు రోజులు కలిసి వచ్చాయి. కలమట వెంకటరమణతో టికెట్ కోసం ఆఖరి వరకు పోటీ పడిన మామిడి గోవిందరావు టికెట్ సంపాదించారు. 2019లోనూ ఆశ పడినా అప్పట్లో టికెట్ దక్కలేదు. అయినా ప్రజల్లో ఉంటూ అధిష్టానం దృష్టిలో పడ్డారు. ఇప్పుడు ఏకంగా సిట్టింగ్ ఎమ్మెల్యే రెడ్డి శాంతిపై గెలుపొంది తొలిసారిగా చట్టసభలో అడుగు పెట్టనున్నారు.

పాత్రికేయుడి నుంచి ఎంపీ వరకు..

ఎచ్చెర్ల క్యాంపస్: రణస్థలం మండలం వీఎస్ పురానికి చెందిన కలిశెట్టి అప్పలనాయుడు పాత్రికేయ వృత్తి నుంచి ఎంపీ వరకు ఎదిగారు. రణస్థలంలో గ్రామీణ విలేకరిగా పనిచేస్తూ ఎచ్చెర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే, అప్పటి స్పీకర్, మంత్రి కావలి ప్రతిభా భారతి అనుచరుడుగా మారారు. ఆమె అప్పలనాయుడును రాజకీయాల్లో ప్రోత్సహిస్తూ.. పొందూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించారు. అనంతరం ఆయన టీడీపీలో నాయకుడిగా ఎదిగారు. ఆ తర్వాత 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరారు.

పీఆర్‌పీ కాంగ్రెస్‌లో విలీనం కావటంతో మళ్లీ టీడీపీలోకి వచ్చారు. ఎచ్చెర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే టిక్కెట్‌కు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. విజయనగరం ఎంపీ టిక్కెట్ లభించడంతో అక్కడ పోటీ చేసి విజయం సాధించారు.



పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

కాంగ్రెస్‌కు 'రిక్తహస్తం'

శ్రీకాకుళం అర్బన్: తాజా సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులంతా డిపాజిట్‌లు కోల్పోయారు. జిల్లాలో 8 అసెంబ్లీ, 1 పార్లమెంట్ స్థానానికి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థులకు చెప్పుకోదగ్గ ఓట్లు రాలేదు. 2014, 2019 ఎన్నికలతో పాటు తాజా ఎన్నికల్లో కూడా వరుసగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్‌లు గల్లంతు కావడం గమనార్హం. తాజా లెక్కల ప్రకారం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన పేడాడ పరమేశ్వరరావుకు 6,724 ఓట్లు రాగా శ్రీకాకుళం అసెంబ్లీ స్థానానికి అంబటి కృష్ణారావుకు 4353 ఓట్లు, ఎచ్చెర్ల అభ్యర్థి మజ్జి మల్లేశ్వరరావుకు 2452 ఓట్లు, ఆమదాలవలస అభ్యర్థి సనపల అన్నాజీరావుకు 3481 ఓట్లు, పాతపట్నం అభ్యర్థి కొప్పురోతు వెంకటరమణకు 3451 ఓట్లు, ఇచ్ఛాపురం అభ్యర్థి మాసుపత్రి చక్రవర్తిరెడ్డికి 746 ఓట్లు, పలాస అభ్యర్థి మజ్జి త్రినాథబాబుకి 1064 ఓట్లు, టెక్కలి అభ్యర్థి కిల్లి కృపారాణికి 2684 ఓట్లు, నరసన్నపేట అభ్యర్థి మంత్రి నరసింహమూర్తి 2225 ఓట్లు మాత్రమే లభించాయి. దాదాపుగా స్వతంత్ర్య అభ్యర్థులకు వచ్చిన ఓట్లకు సమానంగా, నోటా కంటే తక్కువ ఓట్లు ఓ జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ అభ్యర్థులకు దక్కాయి.

సజావుగా కౌంటింగ్

ఎచ్చెర్ల క్యాంపస్/ శ్రీకాకుళం పాతబస్టాండ్ : చిలకపాలెంలోని శ్రీ శివానీ గ్రూప్ కళాశాలల్లో మంగళవారం సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సజావుగా జరిగింది. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎన్నికల పరిశీలకులు పర్యవేక్షించారు. ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించారు. పోస్టల్ బ్యాలెట్‌ల కౌంటింగ్ అనంతరం ఈవీఎంల కౌంటింగ్‌లు ప్రారంభించారు. శివానీ ఫార్మసీ కళాశాలలో శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల ఓట్లు, శివానీలోని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం అద్దె క్యాంపస్‌లో ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజక వర్గాల ఓట్లు లెక్కించారు.



పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం



పోస్టల్ బ్యాలెట్ బాక్సులు తీసుకు వస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో ఐఆర్‌ఎస్ అధికారి సౌమ్య



సౌమ్య దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న అర్చకులు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఐఆర్‌ఎస్ అధికారి నూతలపాటి సౌమ్య మంగళవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు గౌరవంగా స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. గోత్రనామాలతో పూజలు తర్వాత ఆలయ విశిష్టతను శంకరశర్మ వివరించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని, తీర్థప్రసాదాలను ఉన్నతాధికారికి అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం విష్ణుచక్రం గ్రామానికి చెందిన జనపాన చిన్నారావు(37) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నారావు సోమవారం రాత్రి మద్యం సీసాలు నడుము వద్ద పెట్టుకుని వెళ్తుండగా రావివలస గ్రామ సమీప జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన సంగతి తెలిసిందే. వెంటనే టెక్కలి జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మగళవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారావుకు భార్య కమల, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆర్టీసీలో రాయితీ పాసుల వెబ్‌సైట్ అప్‌గ్రేడ్

విజయనగరం అర్బన్: నూతన విద్యాసంవత్సరంలో విద్యార్థులకు ఆర్టీసీ ఇచ్చే రాయితీ పాసుల కోసం పాత వెబ్‌సైట్‌లో కొత్తది అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు విజయనగరం ఆర్‌టీసీ డీఎం జె.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిధిలో ఎంఎస్‌టీ పాసులపై తిరిగే విద్యార్థులకు పాసుల మంజూరు మరింత సులభతరం చేసేందుకు వెబ్‌సైట్‌ను అప్‌గ్రేడ్ చేశామని తెలిపారు. ఈ వెబ్‌సైట్ 6, 7వ తేదీలలో వెబ్‌సైట్ పనిచేయదని, 8వ తేదీ నుంచి యథావిధిగా బస్‌పాస్‌ల జారీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కొత్త విద్యాసంవత్సరానికి ఈ నెల 12వ తేదీ నుంచి యథావిధిగా నూతన బస్‌పాసులు జారీ చేసి వినియోగంలోకి తెస్తామ న్నారు. విద్యార్థి చదువుతున్న విద్యాసంస్థ నుంచి స్టడీ సర్టిఫికెట్ బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్, 10వ తరగతి సర్టిఫికెట్ జిరాక్స్ తీసుకుని 'ఆన్‌లైన్‌ఏపీఎస్‌ఆర్‌టీసీపాస్.ఐఎన్' వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్లై చేసుకుని విజయనగరం బస్‌స్టేషన్‌లో గల బస్‌పాస్ కౌంటర్ వద్దకు వచ్చినట్లయితే వెంటనే బస్‌పాస్ జారీ చేస్తామని తెలిపారు.

గాయపడిన మరో యువతి మృతి



మృతిచెందిన లక్ష్మి (ఫైల్)

సీతంపేట: కొద్ది రోజుల కిందట సీతంపేట మండలంలోని వంబరెల్లి లోయలో ఆటో బోల్తా పడిన సంఘటనలో గాయపడిన మరో యువతి సవర లక్ష్మి (23) విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఇప్పటికి ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందడంతో వంబరెల్లి, బుడ్డడుగూడ తదితర గ్రామాల్లో విషాద చాయలు అలుముకున్నాయి. మృతురాలు లక్ష్మికి ఇంకా వివాహం కాలేదు. తండ్రి మంగయ్య కొన్నేళ్ల క్రితం మరణించగా తల్లి బూదమ్మ కూలీనాలీ చేసుకుంటూ కుమార్తె, కుమారుడిని పెంచుతోంది. ఇంటికి పెద్ద దిక్కైన కుమార్తె మృతితో గుండెలవిసేలా ఆ తల్లి రోదిస్తోంది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేలకొరిగిన మినీ ట్రాన్స్‌ఫార్మర్



గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్

బలిజిపేట: మండలంలోని గలావల్లి పంచాయతీ పరిధి కె.గలావల్లి గ్రామంలో గాలి, వాన, పిడుగుల ప్రభావంతో మినీ ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగింది. మంగళవారం సాయంత్రం ఉరుములు, పిడుగులు, గాలి, వాన బీభత్సం సృష్టించడంతో ప్రమాదం సంభవించినట్లు గ్రామస్తులు తెలిపారు. మినీ ట్రాన్స్‌ఫార్మర్ విరిగిపోవడంతో విద్యుత్ వైర్లు తెగిపడిపోయాయని వెంటనే అధికారులు చర్యలు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరారు.

వాతావరణం..

అరచేతిలో సమాచారం

- వాతావరణ మార్పులను సూచిస్తున్న యాప్‌లు
- స్మార్ట్‌ఫోన్లకు వర్షం, పిడుగుల సమాచారం



ఇచ్ఛాపురం రూరల్ : ఒకప్పుడు వాతావరణ సమాచారం కోసం టీవీలు, రేడియోలు, పత్రికలపై ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం, అరచేతిలో ఇమిడే ఆండ్రాయిడ్ ఫోన్లతో ఎంచక్కా.. ఎప్పుడు కావాలంటే అప్పుడు వాతావరణంలో మార్పులు తెలుసుకునే సౌకర్యం లభించింది. ఏపీ విపత్తుల సంస్థ 'జేడీ–ఎస్డీఎంఏఈడబ్ల్యూ' పేరుతో, భారత వాతావరణ శాఖలు ఎప్పటికప్పుడు వాతావరణ మార్పులపై మెసేజ్‌లు, అలారంతో హెచ్చరికలు చేస్తుంటాయి. దీంతో పాటు ప్రత్యేకంగా కేటాయించిన యాప్‌లపై ఒక్క క్లిక్‌తో రాగల 24 గంటల్లో వర్షం పడే సూచనలున్నాయా..?, పిడుగులు ఏ ప్రాంతంలో పడే అవకాశం ఉందన్న విషయాన్ని కూడా గుర్తించవచ్చు. స్మార్ట్‌ఫోన్లలోని గూగుల్ ప్లేస్టోర్ నుంచి వజ్రపాత్, విండీ, మేఘదూత్, రెయిన్ అలారం వంటి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటే ఈ వివరాలను తెలుసుకోవచ్చు. అందుకనుగుణంగా పనుల్లో మార్పులు, చేర్పులు చేసుకొనే వెసులుబాటు లభించనుంది. ముఖ్యంగా గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో శ్రమించే రైతులకు, ఇంకా పశు పోషకులకు, కోళ్లఫారం నిర్వాహకులు, ఇతర వ్యాపారులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. వర్షాలు వచ్చిన సమయంలో పిడుగులు పడే అవకాశాలు అధికంగా ఉంటాయి. మనుషులు, మూగజీవాలు ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటాయి. ముందస్తుగా సమాచారం తెలుసుకుంటే అప్రమత్తమై సురక్షిత ప్రాంతాల్లో ఉండొచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందుబాటులోకి తీసుకొచ్చిన వివిధ యాప్‌లపై అవగాహన పెంచుకోవడం ద్వారా ఎంతో ఉపయోగం కలగనుంది.

యాప్‌లు.. ఉపయోగాలు



విండీ: వర్షాలు పడే అవకాశం తెలుసుకోవచ్చు. నీలం రంగు ఉంటే తీవ్రత అధికంగా భావించాలి. మూడు లైన్లు క్లిక్ చేస్తే ఏ ప్రాంతంలో వర్షం కురుస్తుందో తెలుసుకోవచ్చు.

వజ్రపాత్: దీని ద్వారా మన సమీపంలో పిడుగులు పడే విషయాన్ని గుర్తించవచ్చు. 30 నుంచి 50 కిలోమీటర్ల వరకు జరిగే వాతావరణ మార్పులను తెలుపుతుంది.

మేఘదూత్: మేఘావృతం, గాలుల తీవ్రత, వాతావరణ మార్పులను సూచిస్తుంది.

రెయిన్ అలారం: 20 కిలోమీటర్ల దూరంలో ఎక్కడ వర్షం పడే అవకాశం ఉందో చెబుతుంది. ఉష్ణోగ్రత ప్రభావాన్ని చూపిస్తుంది.

సమగ్ర సమాచారం



వాతావరణానికి సంబంధించి తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు యాప్‌ల ద్వారా తెలుసుకోవడం అలవాటు చేసుకుంటే మంచిది. ముఖ్యంగా కోళ్లఫారం, మేకలు, గొర్రెల మందల యజమానులు ముందస్తు సమాచారాన్ని తెలుసుకొని వాటిని సురక్షితంగా ఉంచుకోవచ్చు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణం, పంట పొలాల్లో పనులు చేసుకునే సమయాల్లో ఈ సమాచారం మరింత ఉపయోగకరం. స్మార్ట్‌ఫోన్ కలిగి ఉన్న వారిని ఏపీ విపత్తుల సంస్థ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుంది.

– దూగాన చిరంజీవులు, రిటైర్డ్ అడిషనల్ చీఫ్ జడ్జి, సోంపేట

ప్రశాంతంగా ముగిసిన కౌంటింగ్



రెడ్‌జోన్ పరిధిలో పోలీసు బందోబస్తు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. కౌంటింగ్ జరిగిన ఎచ్చెర్ల మండలం చిలకపాలెం శివానీ కళాశాల పరిధి రెండు కిలోమీటర్ల మేర రెడ్ జోన్ ఉండటం.. 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉండి మూడంచెల పటిష్ట భద్రత, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పరిసర ప్రాంతాల్లో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగలేదు. కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లు తమ గుర్తింపు పత్రాలను చూపించనిదే పోలీసులు లోపలికి అనుమతించలేదు. జిల్లావ్యాప్తంగా ఎక్కడా అల్లర్లు గానీ, హింసాత్మక ఘటనలు కానీ చోటుచేసుకోలేదని, శాంతిభద్రతలు అదుపుతప్పలేదంటూ ఎస్పీ జి.ఆర్.రాధిక ప్రకటించారు. కౌంటింగ్ ప్రక్రియ జరిగే ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. ప్రశాంత వాతావరణంలో, సజావుగా జిల్లాలో 2024 సార్వత్రిక ఎన్నికల అంకం ముగిసిందని, సహకరించిన జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు ఎస్పీ తెలిపారు.

డిపాజిట్లు కోల్పోయిన స్వతంత్రులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సార్వత్రిక ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసినవారంతా కనీసం ప్రభావం చూపకుండానే చతికిలబడ్డారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో ఒక్క స్వతంత్ర అభ్యర్థి కూడా పోటీచేయలేదు. గతంలో స్వతంత్రులుగా బరిలో దిగి శాసన సభ్యులుగా ఎన్నికైన చరిత్ర ఉంది. 1952లో టెక్కలి నుంచి ఆర్.ఎల్.ఎన్ దొర, 1972లో శ్రీకాకుళం నుంచి చల్ల లక్ష్మినారాయణ, 1978లో ఆమదాలవలస నుంచి పైడి శ్రీరామ్మూర్తి, 1989లో టెక్కలి నుంచి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస నుంచి గౌతు శివాజీలు స్వతంత్రులుగానే గెలుపొందిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఎవరైనా స్వతంత్రులుగా బరిలో దిగితే ప్రధాన అభ్యర్థులు ఆందోళనకు గురయ్యేవారు. గత రెండు, మూడు ఎన్నికల నుంచి స్వతంత్ర అభ్యర్థుల ప్రభావం నామమాత్రంగానే ఉంటోంది. మరోవైపు ఎంపీ అభ్యర్థులుగా ఐదుగురు పోటీ చేసినా ఏ ఒక్కరికి ధరావతు రాలేదు. ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీచేసినా ఏ ఒక్కరికి కనీస ఓట్లు రాకుండానే మిగిలిపోయారు.

శ్రీకాకుళం ఎంపీ ఇండిపెండెంట్

అభ్యర్థులు	ఓట్లు
చెల్లూరి డానియేల్	796
సనపల శ్రావణకుమార్	5960
వాబయోగి 3472	
బేతా వివేకానంద	2523
ఎద్దు లక్ష్మినారాయణ	1598

ఆమదాలవలస నియోజకవర్గం

గణపతి జగదీశ్వరరావు	546
గాంధీ సువ్వారి	9537
ముద్దాడ రాంబుజ్జి	166
ఎల్.వి.రాజశేఖర్	474
సనపల సురేష్‌కుమార్	386

పలాస నియోజకవర్గం

కర్ని వెంకటరమణ	142
తెలగవలస జయరాం	322
డి.వీరాస్వామి	357

నరసన్నపేట నియోజకవర్గం

బోర వెంకట సత్యేంద్రనాథ్	
అభిషేక్	332
మైలపల్లి జగదీష్	291

పాతపట్నం నియోజకవర్గం

అసపన్న శంకరరావు	113
కోయ్యాన గోవిందరావు	241
బగ్గ కృష్ణ	320
ఆర్.మోహనరావు	592

ఎచ్చెర్ల నియోజకవర్గం

ఎస్.ఈశ్వరరావు	601
గొర్లె కిరణ్‌కుమార్	303
గొర్లె రాంబాబు	679
సువ్వారి రమ్య	839

టెక్కలి నియోజకవర్గం

అట్టాడ రాజేష్	614
గెడ్డవలస రాము	482

ఇచ్ఛాపురం నియోజకవర్గం

మురపాల లక్ష్మి	208
సుగ్గు చక్రవర్తి	274
సూర్యవరప్రసాదరావు	
జన్నెల	728

రెడ్‌జోన్‌లో పటిష్ట భద్రత

కౌంటింగ్ కేంద్రం చిలకపాలేంలోని శివానీ ఇంజినీరింగ్ అధికారులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద సోమవారం రాత్రి నుంచి రెండు కిలో మీటర్లు మేరకు భద్రత ఏర్పాటు చేశారు. విశాఖపట్నం డీఐజీ విశాల్ గున్ని భద్రత పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎస్పీ జీఆర్ రాధిక కూడా పరిశీలించారు.

–ఎచ్చెర్ల క్యాంపస్



కౌంటింగ్ కేంద్రం వద్ద సూచనలు ఇస్తున్న విశాఖపట్నం రేంజ్ డీఐజీ విశాల్‌గున్ని



శివానీ కళాశాల బయట భద్రత పరిశీలిస్తున్న రాధిక



కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రత పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

నీట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



మలిపెద్ది ప్రణవ్‌సాయి

టెక్కలి: వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాల్లో టెక్కలికి చెందిన మలిపెద్ది ప్రణవ్‌సాయి ఆలిండియా స్థాయిలో 430వ ర్యాంకు సాధించాడు. పట్టణానికి చెందిన మలిపెద్ది మధుసూదనరావు, సంతోషికుమారిల కుమారుడైన ఈ విద్యార్థి మంగళవారం దేశవ్యాప్తంగా విడుదలైన ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 430వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 114వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా ప్రణవ్‌సాయిని పలువురు అభినందించారు.

సత్తా చాటిన గౌతమి



బండి గౌతమి

పాతపట్నం: నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రాన్స్ టెస్ట్–2024 (నీట్స్)లో జాతీయ స్థాయి ర్యాంకుల్లో పాతపట్నం మండలం తీమర గ్రామానికి చెందిన బండి గౌతమి సత్తా చూపించింది. మంగళవారం విడుదలైన నీట్స్–2022 ఫలితాల్లో తీమర గ్రామానికి చెందిన బండి గౌతమి ఆల్ ఇండియా 925వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 288వ ర్యాంకు సాధించింది. 720 మార్కులకు గాను 705 మార్కులు సాధించింది. తండ్రి బండి చిరంజీవి మృతి చెందడంతో తల్లి బండి భారతి కష్టపడి చదివించింది. గౌతమి వమ్మరవల్లి రెసిడెన్సీ పాఠశాలలో చదివి పదో తరగతిలో 600 మార్కులకు గాను 594 మార్కులు సాధించింది. ఇంటర్మీడియట్ పాతపట్నం ప్రభుత్వ మోడల్ కళాశాల (స్కూల్)లో చదువుకుంది. బైపీసీలో 1000కి 953 మార్కులు సాధించింది.

ప్రతిభ కనబరిచిన పలాస యువకుడు



గనియా సాయినిఖిల్

కాశీబుగ్గ: నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్ (యు.జి.) 2024 ఫలితాలు మంగళవారం విడుదల చేయగా పలాస మండలం నీలిభద్ర గ్రామానికి చెందిన గనియా సాయినిఖిల్ 720 మార్కులకు గాను 635 మార్కులు సాధించాడు. ఆల్ ఇండియా స్థాయిలో 42903వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 19797వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు గనియా ఢిల్లీరావు, తల్లి రాజ్యలక్ష్మి ఆనందం వ్యక్తం చేశారు.

సత్తాచాటిన ప్రవీణరెడ్డి



ఆశి ప్రవీణరెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రాన్స్ టెస్ట్–2024(నీట్)లో ఈదుపురం గ్రామానికి చెందిన ఆశి ప్రవీణరెడ్డి ఓబీసీ కేటగిరిలో 8187వ ర్యాంకు సాధించింది. మంగళవారం విడుదలైన ఫలితాల్లో 720 మార్కులకు గానూ 664 మార్కులు పొందింది. తండ్రి ఆశి రుద్రకుమార్ మాజీ సైనికోద్యోగి కాగా, తల్లి దేవాకి గృహిణి. ప్రవీణరెడ్డి ఇచ్ఛాపురం స్వర్ణభారతిలో పదో తరగతిలో 600 మార్కులకు 568 మార్కులు సాధించగా, విశాఖ ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంటర్‌లో 1000 మార్కులకు 981 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో పాటు మామయ్య, ప్రవాసాంధ్రుడు తిప్పన శంకరరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

గానగంధర్వుడికి ఘనంగా నివాళి



బాల సుబ్రహ్మణ్యం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పలువురు ఘనంగా నివాళి అర్పించారు. సహాయ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో గరివిడి పట్టణంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావుతో పాటు పలువురు బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి పూలమాల వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా ఆయన గొప్పతనాన్ని కొనియాడారు.

కార్యక్రమంలో సహాయ్ సంస్థ అధ్యక్షుడు ఉప్పు శ్రీనివా సరావు, గణేశ్వరరావు, బలగ అప్పారావు, సరిది రాంబాబు, బ్రహ్మాజీ, కిరణ్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడ్ని కడతేర్చిన అన్న



కాలనీలో సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ కె రవికుమార్



ఎస్ఐ ముందు రోదిస్తున్న మృతుడి కుటుంబీకులు



హేమంత్ (ఫైల్)

సీతానగరం: మండలంలోని పెదభోగిలి హడ్కో కాలనీలో మంగళవారం సాయంత్రం సొంత తమ్ముడు గుజ్జల హేమంత్(42)ను అన్న గుజ్జల రవీంద్రకుమార్ కడతేర్చాడు. ఈ హత్య ఘటనపై స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుజ్జల రవీంద్రకుమార్, హేమంత్ అన్నదమ్ములు, తన ఇంటి సమీపంలోనే ఉన్న అన్న రవీంద్రకుమార్ ఇంట్లో హేమంతకుమార్ కలపను భద్రపరిచాడు. కలప పోతుందని ఇంటి పనిచేసి తీసుకెళ్లాలంటూ అన్నదమ్ముల మధ్య రెండు రోజులుగా గొడవ జరుగుతోంది. అయినా తమ్ముడు హేమంత్ కలప తరలించక పోవడంతో మంగళవారం మాటామాటా పెరగడం కొట్లాటకు దారితీసింది. దీంతో సమీపంలో ఇంటివద్ద పూలు కటింగ్ చేసే కత్తితో రవీంద్రకుమార్ గొంతులోంచి గాయపర్చడంతో హేమంత్ సంఘటనా స్థలంలో కుప్పకూలిపోయాడు. వెంటనే హేమంత్‌ను నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా ఆస్పత్రిలో చేరే సమయానికి మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ సంఘటన తెలుసుకున్న పార్వతీపురం రూరల్ సీఐ కె రవికుమార్ హత్య జరిగిన సంఘటనా స్థలంలో పరిశీలించి, మృతుడి నివాసానికి వెళ్లి హత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి భార్య ఆశాజ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

రక్తదానం ప్రాణదానం

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానమని రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి సత్యం అన్నారు. స్థానిక రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో ఎన్‌సీసీ విద్యార్థులు నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చునని తెలిపారు. మనిషి మాత్రమే ఆపదలో ఉన్న సాటి మనిషికి రక్తం దానం చేసి ప్రాణాలు కాపాడగలడని అన్నారు.

బాసంగి పంట పొలాల్లో ఏనుగులు



పొలాల్లో ఉన్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి పంట పొలాల్లో ఏనుగుల గుంపు మంగళవారం ఉదయం సంచరించింది. మధ్యాహ్నం ముంపు పొలాల్లో ఉంటూ సాయంత్రానికి వెంకటరాజపురం, నిమ్మలపాడు, బాసంగి పంట పొలాలై న అరటి, పామాయిల్ తోటలోకి జారుకున్నా యి. అరటి పంటను ధ్వంసం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇంటికి వచ్చే సమయాన పంట నేలకొరగడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఏనుగులను తరలించే ప్రయత్నం చేయాలని రైతులు కోరుతున్నారు

పిడుగుపాటుకు 25 గొర్రెల మృతి



వంగర: పిడుగుపాటుకు మృతిచెందిన గొర్రెలు

వంగర: మండల పరిధి నీలయ్యవలస గ్రామ సమీపంలో పిడుగు పడి 25 గొర్రెలు మృతిచెందాయి. బలిజిపేట మండలం చినగలావిల్లికి చెందిన గొర్రెల కాపరి ముగడ అప్పన్న..నీలయ్యవలస సమీపంలో గొర్రెల మేతకు తీసుకువచ్చాడు. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో పిడుగులు పడడంతో అక్కడికక్కడే 25గొర్రెలు మృతి చెందా యి. దీంతో తమను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

మరో ఘటనలో మూడు ఆవులు



సంతకవిటి : వాసుదేవపట్నం పొలాల్లో పిడుగుపాటుకు గురై మృతిచెందిన ఆవు

సంతకవిటి: మండలంలోని వాసుదేవపట్నం గ్రామం వద్ద పిడుగుపాటుకు గురై మూడు ఆవులు మృతిచెందాయి. వివరాల్లోకి వెళ్తే పొలాల్లో మేత నిమిత్తం గ్రామానికి చెందిన రైతులు ఆవులను విడిచిపెట్టారు. ఉన్నపళఫగా మేఘాలు ఏర్పడి ఉరుములు, మెరుపులతో కూడిన మేఘాలు ఏర్పడడంతో పాటు ఆవులు ఉన్న ప్రాంతంలో ఒక పిడుగుపడడంతో గ్రామానికి చెందిన మొదలవలస కమల, మజ్జాడ సత్యం, కోడిపీతల శ్రీనులకు చెందిన మూడు పాడిఆవులు అక్కడికక్కడే మృతిచెందాయి.